ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

సోమవారం 15 జూలై 2024

మాధవరంలో ఎన్‌కౌంటర్

- ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు తిరువేంగడం హతం
- నకిలీ అంటూ ఈపీఎస్ ధ్వజం



తిరువేంగడం మృతదేహం



తిరువేంగడం (ఫైల్‌ఫొటో)



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. మాధవరంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితుడు తిరువేంగడం హతమయ్యాడు. ఈ నెల 5 రాత్రి పెరంబూరులో ఆమ్‌స్ట్రాంగ్‌ను హత్య చేయడానికి పథకం వేసిన తిరువేంగడం పోలీసులకు లొంగిపోయి వారం దాటక ముందే ఎన్‌కౌంటర్ అయ్యాడు. ఆమ్ స్ట్రాంగ్ హత్య జరిగిన కొద్ది గంటల్లోనే ఎనిమిదిమంది నిందితులను, ఆ తర్వాత మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కుండ్రత్తూరు పెరియార్ నగర్ కామరాజర్ వీధికి చెందిన 33 ఏళ్ల తిరువేంగడం ఒకడు. స్థానిక పరంగిమలై సాయుధదళం ప్రాంగణంలో తిరువేంగడంను పోలీసులు గత రెండు రోజులుగా విచారణ జరుపుతున్నారు. ఆ విచారణలో భాగంగా కొడంగయూరు శాంతి భద్రతల విభాగం సీఐ శరవణన్ తన సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం తిరువేంగడంను తీసుకుని మనలి ప్రాంతంలో ఉన్న అతడి ఇంటి వద్దకు మారణాయుధాలు స్వాధీనం చేసుకునేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు రెట్టేరి ఏరి కృరై ఆట్టు మందై వద్ద వ్యాన్ ఆపారు. వ్యాన్ నుంచి దిగిన తిరువేంగడం తనతోపాటు వస్తున్న కానిస్టేబుళ్లను నెట్టేసి పారిపోయాడు. దీంతో తండయార్‌పేట సీఐ మహమ్మద్ బుహారీ నేతృత్వంలో పోలీసులు మాధవరం ఆట్టుదొడ్డి పరిసర ప్రాంతాల్లో తిరువేంగడం ఆచూకీకోసం గాలింపు చర్యలుచేపట్టారు. ఆ తర్వాత పుళల్ వెజిటేరియన్ విలేజ్ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో ఓ రేకుల కొట్టంలో తిరువేంగడం దాగి ఉన్నాడని గుర్తించారు. దీంతో పోలీసులు ఆ రేకుల కొట్టాన్ని చుట్టిముట్టారు. తిరువేంగడంను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో తిరువేంగడం తనదగ్గరున్న నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో ఆత్మసంరక్షణార్థం సీఐ మహమ్మద్ బుహారీ ఎదురుకాల్పులు జరపటంతో తిరువేంగడం కుడివైపు ఉదరంలో ఎడమవైపు ఛాతీలో తూటాలు దూసుకుపోవడంతో తీవ్ర ంగా గాయపడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం మాధవరంలోని మెరిడియన్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఆ తర్వాత పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్టాన్లీ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఎన్‌కౌంటర్ సంఘటనకు సంబంధించి ఎం-3 పుళల్ పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం వద్ద ఉద్రిక్త పరిస్థితులున్నాయి. ఎన్‌కౌంటర్‌లో హతమైన తిరువేంగడం ఆమ్‌స్ట్రాంగ్ స్నేహితుడు బాంబ్ శరవణన్ సోదరుడు తెన్నరసు హత్యకేసులో ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. 2014లో కుండ్రత్తూరు పోలీసుస్టేషన్‌లో ఇతడిపై ఓ హత్యకేసు కూడా ఉంది. ఆమ్‌స్ట్రాంగ్ కదలికలపై నెల రోజులకు పైగా నిఘా వేసి, ఆ తర్వాత ఆయన హత్యకు పథకం రూపొందించింది తిరువేంగడమేనని పోలీసులు తెలిపారు. అంతే కాకుండా, ఈ నెల ఐదోతేదీ రాత్రి పెరంబూరులో కొత్త ఇంటి నిర్మాణ స్థలం వద్దనున్న ఆమ్‌స్ట్రాంగ్‌ను వేటకొడవలితో మొదటగా దాడి చేసింది కూడా తిరువేంగడమేనని చెబుతున్నారు. అతడిపై పలు పోలీసు స్టేషన్లలో దారిదోపిడీ కేసులు, ఘర్షణకేసులు, హత్యాయత్నం కేసులు కూడా నమోదై ఉన్నట్లు తెలిపారు.

ఎన్‌కౌంటర్ కాదు డీఎంకే డ్రామా : సీమాన్

బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు తిరువేంగడం ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడనే సమాచారం తెలుసుకుని దిగ్భ్రాంతిచెందానని నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ పేర్కొన్నారు. పలు హత్యకేసుల్లో నిందితుడైన తిరువేంగడంకు తగిన భద్రతా ఏర్పాట్లను పోలీసులు కల్పించలేదని ఎన్‌కౌంటర్ సంఘటన స్పష్టం చేస్తోందని, అన్ని వివరాలను పరిశీలిస్తే జరిగిన సంఘటన ఎన్‌కౌంటర్ కాదని, డీఎంకే ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించిన హైడ్రామా అని సీమాన్ ఆరోపించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ...

ఇదిలా ఉండగా ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో అదనపు పోలీసు కమిషనర్ నాగేంద్రన్ నాయర్, డిప్యూటీ కమిషనర్ విజయకుమార్, కొళత్తూరు డిప్యూటీ కమిషనర్ పాండ్యరాజన్ తదితరులు పరిశీలించారు. తిరువేంగడం దాగిన రేకుల కొట్టంలో పడి ఉన్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో ఇతరులెవరూ వెళ్లకుండా బారికేడ్లు కూడా ఏర్పాటు చేశారు.

సంకెళ్లు వేయకుండా తీసుకెళ్లారా?

బీఎస్పీనేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు తిరువేంగడంపై జరిగిన ఎదురుకాల్పుల సంఘటన పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. వేలూరు జిల్లా కాట్పాడి వద్ద ఆదివారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌లో హతమైన తిరువేంగడం పోలీసుల ఎదుట లొంగిపోయాడని, అలా లొంగిన నిందితుడిని ఆదరాబాదరాగా వేకువజామునే మారణాయుధాల స్వాధీనం పేరుతో మాధవరానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. హత్యకేసు నిందితుడైన తిరువేంగడం చేతికి సంకెళ్ల వేయకుండా తీసుకెళ్లడంకూడా పోలీసులపై అనుమానాలు కలుగుతున్నాయని ఈపీఎస్ ఆరోపించారు. ఆమ్‌స్ట్రాంగ్ కుటుంబీకులు హత్యకు సంబంధించి నిజమైన దోషులను అరెస్టు చేయాలని కోరుతున్న నేపథ్యంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్ పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందన్నారు. అదేవిధంగా ఆమ్‌స్ట్రాంగ్ మృతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

భవిష్యత్ కాంగ్రెస్‌దే

- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై



పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తున్న సెల్వపెరుంతగై

ప్యారీస్, జూలై 14: తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించిందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ చేతికి దేశ పగ్గాలను అప్పగించే అవకాశముందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై అభిప్రాయం వ్యక్తం చేశారు. నార్త్ చెన్నై పశ్చిమ జిల్లా అధ్యక్షుడు జె.డిల్లీ బాబు ఏర్పాటుచేసిన మతసామరస్య పాదయాత్రను సెల్వపెరుందగై ఆదివారం కొడుంగైయూర్‌లో ప్రారంభించి 12 కి.మీ నడిచారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశంలో భవిష్యత్తులో జరుగబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని, ఇందుకు విక్రవాండి ఉప ఎన్నికలు ట్రయల్ రన్‌గా ఉన్నాయన్నారు. సోమవారం పేదల పాలిటి పెన్నిధి, విద్యార్థుల సంక్షేమాన్ని కాంక్షించిన మహానేత కామరాజర్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన మతసామరస్య పాదయాత్ర ప్రజల్లో మాదకద్రవ్యాల నివారణ, రాష్ట్రంలో పటిష్ఠ భద్రత, మతశక్తులకు తావులేని రాష్ట్రంగా ఉండాలన్న భావన కలిగిస్తుందన్నారు. ఈ పాదయాత్రలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, ఎమ్మెల్యేలు చంద్రశేఖరన్, హసన్ మౌలానా, ఇమయాకక్కన్, జిల్లా ఉపాధ్యక్షులు విల్లివాక్కం టి.సురేస్, పెరంబూర్ నిజార్ సహా వందలాది మంది పాల్గొన్నారు. కొడుంగైయూర్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ఎంఆర్ నగర్, ఎంకేబీ నగర్, మేల్‌పట్టపొన్నప్ప మొదలి వీధి మీదుగా 12 కి.మీ సాగి పెరంబూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని కామరాజర్ విగ్రహం వద్ద ముగిసింది.

ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో

నేడు 'సీఎం అల్పాహార పథకం' ప్రారంభం

- కీళచ్చేరి నుంచి సీఎం స్టాలిన్ శ్రీకారం



అడయార్, జూలై 14: రాష్ట్రంలోని ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' సోమవారం నుంచి ప్రారంభంకానుంది. తిరువళ్ళూరు జిల్లా కడంబత్తూరు యూనియన్‌లోని కీళచ్చేరి గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. ఇందుకోసం ఆయన సోమవారం ఉదయం తిరువళ్ళూరు జిల్లా వెళ్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకం అమలవుతోంది. ఈ పథకానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల నుంచి స్పందనవస్తోంది. దీనికితోడు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు విస్తరించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించి, వార్షిక బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందులోభాగంగా, ఈ నెల 15వ తేదీ సోమవారం మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ జయంతిని పురస్కరించుకుని, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు ఈ అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 3,995 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 2,23,536 మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 1,545 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,14,000 విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించే ఈ పథకాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు , ఉపాధ్యాయులు పాల్గొనున్నారు.

నీట్‌పై కలిసి పోరాడుదాం!

స్టాలిన్‌కు రాహుల్ లేఖ



చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తీరని నష్టం కలిగించే నీట్ కు వ్యతిరేకంగా డీఎంకేతో కలిసి పోరాడేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ లోక్‌సభ సభాపక్షనాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జూన్ 28న స్టాలిన్ తనకు రాసిన లేఖకు ఆదివారం ఆయన బదులిచ్చారు. లోక్‌సభ సభాపక్షనాయకుడిగా ఎన్నికైన సందర్భంగా స్టాలిన్ తెలిపిన శుభాకాంక్షలకు రాహుల్ ధన్యవాదాలు తెలియజేశారు. నీట్ ప్రశ్నపత్రాలు లీకై ఉన్నత విద్యావ్యవస్థలోని లోపాలను బహిర్గతపరిచిందని, నీట్ లీకేజీపై కాంగ్రెస్ వెంటనే స్పందించిందని, కేంద్ర ప్రభుత్వం, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ భారీ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేసిందన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రసంగిస్తూ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు అందుబాటులో లేకపోవడం, ఇతర సౌకర్యాల కొరత కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతున్నారని రాహుల్ తెలిపారు. ప్రజాధనంతో నడిపే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొద్దిమందికి మాత్రమే ప్రవేశం పొందడం గర్హనీయమన్నారు. తమిళనాడు ప్రభుత్వం వైద్యవిద్యారంగాన్ని బాగా అభివృద్ధి చేసిందని, ప్రజారోగ్య వ్యవస్థ కూడా అన్ని వర్గాల నుండి ప్రశంసలందుకుంటోందన్నారు. నీట్‌కు వ్యతిరేకంగా కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని, త్వరలో స్టాలిన్‌ను కలుస్తానని రాహుల్ ఆ లేఖలో తెలిపారు.

త్వరితగతిన సామాన్యుడికి న్యాయం

- హైకోర్టు సీజే మహాదేవన్



అడయార్, జూలై 14: కోర్టులను ఆశ్రయించే సామాన్యుడి కాలంతో సమానంగా తక్షణ న్యాయం లభించాలని మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహాదేవ్ అభిప్రాయపడ్డారు. పుదుచ్చేరిలో నిర్మించిన ఏడు కోర్టులను ఆయన ప్రారంభించారు. శనివారం సాయంత్రం జరిగిన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాలు అనేవి రాళ్ళు సిమెంట్‌తో నిర్మించే భవనాలు కావన్నారు. సామాన్య ప్రజానీకానికి తగిన సమయంలో త్వరితగతిన న్యాయం చేకూర్చే న్యాయాలయాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క న్యాయమూర్తి గుర్తుపెట్టుకోవాలన్నారు. దేశంలోని కోర్టుల్లో నానాటికీ పెరిగిపోతున్న కేసులను చూస్తుంటే ఒక రకమైన ఆందోళన కలుగుతుందన్నారు. ఈ కేసుల పరిష్కారానికి సత్వర మార్గం కనుగొనాలని ఆయన కోరారు.

ఏడు జిల్లాలకు భారీ వర్షసూచన

ప్యారీస్, జూలై 14: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా కొండలు అధికంగా ఉన్న నీలగిరి, కోయంబత్తూర్, సేలం తదితర ఏడు జిల్లాల్లో సోమవారం భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించిది. నుంగంబాక్కం కాలేజీ రోడ్డులోని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. సముద్రంలో పశ్చిమ దిశ గాలుల ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల ఈ నెల 15,16,17,19 తేదీల వరకు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలో పశ్చిమ దిశవైపు గాలులు వేగంగా వీస్తాయని, సోమవారం నీలగిరి, కోయంబత్తూర్, ఈరోడ్, ధర్మపురి, సేలం, కృష్ణగిరి, తిరుపత్తూర్ ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మంగళవారం నీలగిరి, ఈరోడ్, తిరుప్పూర్, దిండుగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. కాగా, శనివారం ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షాలు కురుస్తాయని, ఇందులో గరిష్ఠంగా కడలూరు జిల్లా కీళచ్చేరులో 23 సెం.మీ వర్షపాతం నమోదైంది. దక్షిణ కోస్తా తీరంలో గంటకు 35 నుంచి 45 కి.మీ వేగంతో, మధ్య మధ్య 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అందువల్ల సముద్రంలో జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది.

రాజధాని నగరంలో...

చెన్నైలో సోమవారం పలు ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పగటిపూట ఉష్ణోగ్రత కాస్త అధికంగా ఉన్నా మధ్యాహ్నం తర్వాత వాతావరణం చల్లబడుతుందని, ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు. తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లోనూ కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తుందని తెలిపారు.

చర్చలతోనే జాలర్ల సమస్య పరిష్కారం

శ్రీలంక ఎంపీ రవూఫ్ హకీం



అడయార్, జూలై 14: భారత్, శ్రీలంక దేశాల జాలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం చర్చలేనని శ్రీలంక ముస్లిం కాంగ్రెస్ పార్టీకి చెందిన కండి ఎంపీ రవూఫ్ హకీం తెలిపారు. తంజావూరులో ఆదివారం జరిగిన ఓ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారత్ శ్రీలంక దేశాలకు చెందిన జాలర్ల సమస్యను ఇరు దేశాలు కలిసి చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల తమిళ జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ - శ్రీలంక దేశాల మధ్య నౌకా ప్రయాణం ప్రారంభించడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అది తాత్కాలికంగా వాయిదాపడిందన్నారు. ఇపుడు కూడా కొన్ని ప్రైవేటు కంపెనీల రవాణా తిరిగి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇరు దేశాల మధ్య ఉపరితల రవాణా రామసేతు వారధి మీదుగా జరగాల్సి ఉందన్నారు. అయితే, ఈ మార్గం నిర్మాణానికి అనేక అవాంతరాలున్నాయన్నారు. పైగా శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం కూడా ఈ మార్గం నిర్మాణానికి ఒక ప్రతిబంధకంగా మారిందన్నారు. భారత్ నుంచి శ్రీలంకకు పైపులైను ద్వారా చమురు సరఫరాకు ఒప్పందం ఖరారైందన్నారు. తమ దేశంలో భారత్ లక్ష గృహాలను నిర్మించేందుకు ముందుకు రావడాన్ని తాము స్వాగితిస్తున్నామన్నారు. అదేవిధంగా తమిళ జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కాం కనుగొనేందుకు తమ పార్టీ తమిళ జాలర్లకు అనుకూలంగానే ఉంటుందన్నారు. తమ దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకున్నపుడు భారత్ రూ.4 వేల మిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేసిందని, ఈ సాయంతో కొంతమేరకు గట్టెక్కినట్టు తెలిపారు.

సమాచార దర్శిని

శ్రీలంక, నేపాల్‌కు పర్యాటక విమానం

పెరంబూర్, జూలై 14: రాష్ట్రం నుంచి శ్రీలంక, నేపాల్ దేశాలకు ఐఆర్‌సీటీసీ పర్యాటక విమానం నడుపనుంది. చెన్నై, తిరుచ్చి నగరాల నుంచి ఈ పర్యాటక విమానాలు బయల్దేరనున్నాయి. తిరుచ్చి నుంచి ఆగస్టు 11న కశ్మీర్‌కు, చెన్నై నుంచి కశ్మీర్, గుజరాత్, భువనేశ్వర్, హరిద్వార్, నేపాల్, భూటాన్, శ్రీలంక తదితర ప్రాంతాలు సందర్శించవచ్చు. ఒక్కో యాత్ర 5 నుంచి 8 రోజులు ఉంటుంది. ఛార్జీ రూ.43,000 నుంచి రూ.92,000 వరకు ఉంటుంది. వివరాలకు 8287931968, 8287932122 నెంబర్లలో సంప్రదించవచ్చు.

రేపటి నుంచి బోధనేతర సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్

పెరంబూర్, జూలై 14: పాఠశాల విద్యాశాఖలో మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ 'గూగుల్ మీట్' వెబ్‌సైట్‌లో జరుగనుంది. ఈ నెల 16,18,19 తేదీల్లో జరుగనున్న కౌన్సెలింగ్‌ను జిల్లా ప్రధాన విద్యాధికారి, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పర్యవేక్షించనున్నారు. ఏడాదిలోగా పదవీవిరమణ చేయనున్న ఉద్యోగులు ఈ కౌన్సెలింగ్ పాల్గొనాల్సిన అవసరం లేదని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 14: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పల్లావరం: పెరియార్ నగర్, బాలగురుస్వామి నగర్, జయరామన్ వీధి, పళనియప్ప వీధి, బాలసుబ్రమణియన్ వీధి, సొంగువేల్ వీధి, మహిమైదాస్ వీధి, భాస్కర్ వీధి, అరుణ్‌పాండ్యన్ వీధి, రాజీవ్ గాంధీ నగర్, తిల్లై వీధి, పెరియార్ నగర్, శ్రీనివాస కాలని, ఎంజీఆర్ వీధి, బీబీ అమ్మన్ ఆలయం

బీసెంట్‌నగర్: లక్ష్మీపురం, శాస్త్రినగర్, కామరాజ్ రోడ్డు, వాల్మీకివీధి, కళాక్షేత్ర రోడ్డు, శ్రీరామ్‌నగర్, కుమరగురు 1 నుంచి 4 వీధులు పిళ్లయార్ ఆలయ వీధి

కంప్యూటర్ టీచర్ల ఖాళీల వివరాలు తెలపండి

పెరంబూర్, జూలై 14: రాష్ట్రవ్యాప్తంగా మహోన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఉపాధ్యాయుల వివరాలు పంపించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ప్రధాన విద్యాధికారులకు ఉత్తర్వులు పంపారు. 2017-18, 2018-19,2023-2024 విద్యా సంవత్సరాల్లో ఉన్నత పాఠశాలల నుంచి మహోన్నత పాఠశాలల హోదా పొందినా కంప్యూటర్ టీచర్ల నియామకాలు చేపట్టలేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని హోదా పొందిన పాఠశాలల్లో ప్రారంభించనున్నామని, అందువల్ల ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ఉపాధ్యాయులున్నారని, ఖాళీగా ఉన్న పాఠశాలల వివరాలు సత్వరం జిల్లాస్థాయి ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ ఈ-మెయిల్‌కు పంపాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్‌లో పేర్కొనింది.

సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆధ్యాత్మిక యాత్ర

పెరంబూర్, జూలై 14: ఆడిమాసం సందర్భంగా సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆధ్యాత్మిక యాత్ర ఏర్పాటుచేశారు. ఈ మేరకు హిందూ దేవాయా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆడి మాసం సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకు 1,000మంది సీనియర్ సిటిజన్లను ఉచితంగా తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. చెన్నై, తంజావూరు, కోయంబత్తూర్, తిరుచ్చి, తిరునల్వేలి తదితర మండలాల కేంద్రంగా ఈ యాత్ర ఈ నెల 19,26, ఆగస్టు 2,9 తేదీల్లో బయల్దేరుతుందని తెలిపారు. 60 నుంచి 70 ఏళ్ల వయస్సున్న వారు ఈ నెల 17వ తేదిలోపు hrce.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలన్నారు. హిందూ మతానికి చెందిన వారు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటి చిరునామా, ఆధార్, పాన్ కార్డులు, సంవత్సరాదాయం రూ.2 లక్షలలోపుండాలన్నారు. ఒకరు ఒకసారి మాత్రమే పేరు నమోదుచేయాలని, వాటిని పరిశీలించిన అర్హులైన వారిని ఆధ్యాత్మిక యాత్రకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

సెకండరీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 14: ఆదిద్రావిడ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా అర్హులైన టీచర్లను నియమిస్తారని తెలిపారు. అభ్యర్థులు టీచర్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు. అభ్యర్థులు ఆయా పాఠశాలల పరిధిలో నివసిస్తున్న వారై ఉండాలి. దరఖాస్తులు, ఇతర వివరాలకు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈ నెల 19వ తేది సాయంత్రం 5.40 గంటల్లోపు నేరుగా గాని, పోస్టు ద్వారా పంపించాలని కలెక్టర్ తెలిపారు.

ఆన్‌లైన్ జూదానికి బానిసై ఎల్‌ఐసీ ఏజెంట్ ఆత్మహత్య

పెరంబూర్, జూలై 14: ఆన్‌లైన్ జూదంలో లక్షలు పోగొట్టుకున్న ఎల్‌ఐసీ ఏజెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సేలం జిల్లా తారమంగళం పాత గ్యాస్ ఆఫీసు వీధికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ కందస్వామి (45) మహాలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఆన్‌లైన్ జూదానికి బానిసైన కందస్వామి పలువురు వద్ద అప్పులు చేసి ఆట ఆడి నగదు పోగొట్టుకున్నాడు. అప్పు లు పెరగడం, డబ్బు ఇచ్చిన వారి వేధింపులు అధికం కావడంతో, తన స్థలాన్ని అమ్మినా అప్పులు తీరలేదు. ఈ క్రమంలో, అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో మనస్తాపం చెందిన కందస్వామి, శనివారం గదిలోకి వెళ్లి తన వంటికి విద్యుత్ వైరు చుట్టుకొని స్విచ్ వేసి షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భూకబ్జా కేసులో యువకుడి అరెస్టు

ప్యారీస్, జూలై 14: విల్లివాక్కం సమీపంలోని కొరట్టూరు బాలాజీనగర్‌లో రూ.90లక్షల విలువైన భూములు అపహరించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కొరట్టూరు బాలాజీనగర్‌లో ఇబ్రహీంకు చెందిన 2,420 చ.అ భూమిని ఆయన మరణించిన అనంతరం రెహ్మాన్ అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి 2022లో తన భార్య హసీనా పేరుమీద మార్చుకున్నాడు. ఆ తర్వాత అదే ప్రాంతానికి చెందిన ప్రకాష్, హసీనా పేరుతో ఉన్న ఆ భూములను సెంజియమ్మాళ్ అనే మహిళ పేరుతో మార్చి విక్రయించినట్లు తెలిసింది. ఈ మోసంపై హసీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన ఆర్థికనేర విభాగం పోలీసులు శనివారం ప్రకాష్‌ను అరెస్ట్ చేసి పూందమల్లి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లు



ప్యారీస్, జూలై 15: రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో నగరంలో ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్ సంచలనాత్మకమైంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ప్రధాన ముద్దాయి తిరువేంగడంను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఇప్పటివరకు పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్‌కౌంటర్లలో కరుడుగట్టిన హంతకులు హతమయ్యారు. రాజధాని నగరంలో 1996 జూలై 30వ తేదిన మొట్టమొదటి ఎన్‌కౌంటర్ జరిగింది. నుంగంబాక్కం లయోలా కళాశాల సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి దాదా ఆశైతంబి తన అనుచరులతో పాటు పోలీసులపై దాడికి యత్నించి కాల్పుల్లో మరణించారు. ఈ తర్వాత 2003వ సంవత్సరం వెంకటేశ పన్నయార్‌ను ఎన్‌కౌంటర్‌లో మట్టికరిపించారు. అదే ఏట ట్రిప్లికేన్ అయోధ్యకుప్పం దాదా వీరమణిని మెరీనా బీచ్‌లో వెల్లదురై అనే ఎస్‌ఐ ఎన్‌కౌంటర్ చేశారు. 2006 డిసెంబరు 12న పేరుమోసిన పంక్‌కుమార్ అనే రౌడీని ఏసీపీ జాన్‌గిడ్ నేతృత్వంలోని పోలీసుల బృందం ఎన్‌కౌంటర్ చేసింది. 2007 ఆగస్టు 6వ తేది వ్యాసర్పాడి భక్తవత్సలం కాలనీకి చెందిన మరో రౌడీ వెల్ల రవిని ఎన్‌కౌంటర్ చేశారు. 2008 జూలై 11న నగరంలో రౌడీ ముఠా నాయకుడు బాబా సురేష్ పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకొని కాశిమేడు ప్రాంతంలో తలదాచుకున్నాడు. అతడిని అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులపై నాటు బాంబు విసిరే ప్రయత్నాన్ని తిప్పికొట్టిన పోలీసులు అతడిని ఎన్‌కౌంటర్ చేశారు. ఇక, నగరంలో ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో అతిపెద్దదైన ఎన్‌కౌంటర్ ఉత్తరాది రాష్ట్రాల యువకులదే. పలు బ్యాంకుల్లో దోచుకొని పోలీసుల కళ్లుగప్పి తిరిగిన బిహార్‌కు చెందిన ఐదుగురిని వేళచ్చేరిలో అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులపై మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు. అయితే పోలీసులు వారిని ఎదుర్కొనే క్రమంలో ఎన్‌కౌంటర్‌లో దొంగలు మరణించారు.

సీసీ కెమెరా వీడియో విడుదల...

స్థానిక పెరంబూర్ సెంబియం ప్రాంతంలో ఇటీవల బీఎస్పీ చీఫ్ ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు విడుదలై ఒళ్లుగగుర్పొడిపించాయి. ఈ వీడియోలో ఆదివారం ఎన్‌కౌంటర్‌కు గురైన తిరువేంగడం ఉండడం గమనార్హం. ఈ నెల 5వ తేదీన హత్యకు గురైన ఆమ్‌స్ట్రాంగ్ కేసుకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో, ఈ హత్యకు సంబంధించి విడుదల చేసిన వీడియోలో ఇద్దరు వ్యక్తులు బైక్‌లో ఆమ్‌స్ట్రాంగ్ నివసిస్తున్న వీధిలో వెళ్తున్న దృశ్యం నమోదైంది. ఈ బైక్‌ను పొన్నై బాలు అనే ప్రధాన నిందితుడు నడుపగా వెనుక అరుళ్ ఉన్నట్లు, అదే విధంగా మరో రెండు బైక్‌ల్లో వినోద్, గోకుల్, శివశక్తి, విజయ్‌లున్నట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది.

కొత్త రేషన్‌కార్డుకు 'కరెంట్ బిల్' తప్పనిసరి

పెరంబూర్, జూలై 14: ప్రభుత్వ మహిళా సాధికారిత నిధులు పొందేందుకు, ఒక కుటుంబానికి చెందిన వారు కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేలా విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్ను రసీదు తదితరాలు సమర్పించాలని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రజా పంపిణీ పథకం వెబ్‌సైట్‌లో, కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకొనే సమయంలో, వివాహ సర్టిఫికెట్, వంటగ్యాస్ రసీదు, ఆధార్ నెంబరు నమోదుచేయాల్సి ఉంది. అనంతరం, దరఖాస్తులోని చిరునామాను ఆహార సరఫరా శాఖ అధికారులు పరిశీలిస్తుంటారు. ప్రత్యేక వంట గదితో నివసిస్తున్నారని నిర్ధారించుకున్న తర్వాత రేషన్ కార్డు ఇచ్చేందుకు సిఫారసు చేస్తుంటారు. ఈ ప్రక్రియ అంతా 30 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం, రాష్ట్రప్రభుత్వం మహిళా సాధికారిత కింద నెలకు రూ.1,000 అందజేస్తుండడంతో, రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య అధికమైంది. దరఖాస్తులు అధికంగా వస్తున్న కారణంగా కొద్ది నెలలుగా కొత్త రేషన్‌కార్డులివ్వడం లేదు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... మహిళా సాధికారిత నిధులు పొందేందుకు పలువురు దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. వాటిని పరిశీలించగా ఒక ఇంట్లో తల్లిదండ్రులతో కలసి ఉంటున్నారని తెలుస్తుందన్నారు. ప్రత్యేక వంటగదితో ఇంటిలోని వేరే అంతస్తులో ఉంటే వారికి కొత్త రేషన్ కార్డు ఇవ్వడానికి ఎలాంటి ఆక్షేపణ లేదని తెలిపారు. తనిఖీకి వెళ్లిన సమయంలో విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్ను రసీదు అడుగుతున్నామని తెలిపారు. వేరే ఇంట్లో ఉన్న వారు గ్యాస్ రసీదు చూపిస్తే సరిపోతుందన్నారు. అర్హులైన వారికి త్వరలో కొత్త రేషన్‌కార్డులు అందించనున్నామని వారు పేర్కొన్నారు.

రౌడీలపై ఉక్కుపాదం

546 ప్రత్యేక పోలీసు బృందాలతో వేట ● 26వేలమంది కదలికలపై నిఘా

పెరంబూర్, జూలై 14: రాష్ట్రంలో 546 ప్రత్యేక పోలీసు బృందాలు రౌడీల వేట ప్రారంభించాయి. ఆ బృందాలు రాష్ట్రమంతటా ఉన్న 26,000 మంది రౌడీల కదలికలపై నిఘా వేస్తున్నాయి. కొద్దిరోజులుగా రాష్ట్రంలో రౌడీల ఆగడాలు అధికమవుతున్నాయి. వాటిని అడ్డుకొనేందుకు పోలీసు శాఖ ఇదివరకే ఉన్న రౌడీల జాబితా పరిశీలిస్తోంది. కొత్తగా రౌడీలుగా చెలామణి అవుతున్న వారి వివరాలు, ఫోటో, కేసుల వివరాలు చేరుస్తున్నారు. వారు పాల్పడే నేరాలకు అనుగుణంగా 'ఏ ప్లస్, ఏ, బి, సి అంటూ నాలుగు విభాగాలుగా విభజించారు. ఘోరమైన నేరాలకు పాల్పడే 'ఏ ప్లస్' విభాగంలో 421 మంది, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ తదితరాకు పాల్పడే 'ఏ' విభాగంలో 836 మంది రౌడీలున్నారు. ఇక, కట్టపంచాయతీలు, మామూళ్ల వసూలు, అరాచకాలకు పాల్పడే 'బి' విభాగంలో 6,398 మంది, దాడి, అనవసరపు తగాదాలు, అల్లర్లు సృష్టించడం తదితర నేరాలకు పాల్పడే 18,807 మంది 'సి' విభాగంలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్లస్ నుంచి సి విభాగం వరకు 26,432 మంది రౌడీల కదలికలు పసిగట్టేలా 546 ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ విషయమై రౌడీల నిర్మూలన విభాగం అధికారులు మాట్లాడుతూ... రౌడీలను నిర్మూలించేలా, వారి అసాంఘిక కార్యక్రమాలు అడ్డుకొనేలా 546 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న రౌడీలు, వృత్తి వదిలిన వారు, దాదాలు, ప్రతీకారం తీర్చుకోవాలని యత్నిస్తున్న రౌడీలను ఈ ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. వారి ఆస్తి వివరాలు, ఆదాయంపై విచారణకు జోన్లవారీగా పోలీసులను నియమించామని తెలిపారు. జైళ్లలో ఉన్న రౌడీలు ఎవరు, వారిపై పగ తీర్చుకోవాలనే రౌడీలున్నారా తదితరాలను పరిశీలిస్తున్నామని, ఈ ప్రత్యేకబృందాలు రౌడీల కదలికలను నిరంతరం పరిశీలిస్తాయన్నారు. పెండింగ్ కేసుల్లో ఉన్న వారు, కోర్టు వారెంట్ జారీచేసిన రౌడీలను అరెస్ట్ చేసే చర్యలు వేగవంతం చేశామని అధికారులు తెలిపారు.

ఏజే శేఖర్ తండ్రికి ఈపీఎస్ నివాళి




వేలూరు, జూలై 14: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల టీటీడీ సలహా మండలి మాజీ అధ్యక్షుడు ఏజే శేఖర్ తండ్రి జగన్నాథ రెడ్డి కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌లో ఆయన గృహానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదివారం ఉదయం వెళ్లి జగన్నాథరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి శేఖర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు విజయభాస్కర్, కేసీ వీరమణి, ఎమ్మెల్యేలు ఎస్.రవి, జిల్లా కార్యదర్శులు అప్పు, సుకుమార్, ఐటీ వింగ్ జనని పి.సతీష్‌కుమార్, కోశాధికారి మూర్తి, మాజీ కౌన్సిలర్ సీకే శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... విక్రవాండి ఉప ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా జరుగలేదన్నారు. అందువల్లే అన్నాడీఎంకే ఉప ఎన్నికలో పోటీచేయలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కర్ణాటక నీరు అందించాలన్నారు. ముఖ్యంగా, రాష్ట్ర రైతులు, రాష్ట్ర ప్రజల బాగోగులను డీఎంకే పట్టించుకోవడం లేదన్నారు.

కాశిమేడులో జోరుగా చేపల విక్రయం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చేపలవేట నిషేధ కాలం ముగిసిన ఐదో ఆదివారం కాశిమేడు చేపలరేవు వద్ద చేపల అమ్మకాలు ఊపందుకున్నాయి. తమిళ ఆషాఢ (ఆడి) మాసం త్వరలో ప్రారంభం కానుండటంతో చేపల ధరలు కాస్త తగ్గాయి. కేజీ వంజిరం చేపలు రూ.700లు, వవ్వాల్ చేపలు రూ.400లు, చైనీస్ వవ్వాల్ చేపలు రూ.1000లు, శంకరా చేపలు రూ.200లు, షీలా చేపలు రూ.200లు, పీతలు రూ.200లు, ఉలసలాంటి చిన్న చేపలు రూ.75లకు విక్రయించారు. ఆదివారం వేకువజాము నుండే నగరవాసులు కాశిమేడుకు చేరుకుని చేపల కొనుగోలుకు పోటీపడ్డారు.

కీళడి పురావస్తు తవ్వకాల్లో చదరంగం పావు లభ్యం



తవ్వకాల్లో లభించిన ఏనుగు దంతంతో తయారైన చదరంగం పావు

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపం కీళడి వద్ద పదో విడత పురావస్తు తవ్వకాల్లో ఏనుగు దంతంతో తయారైన చదరంగపు పావు లభించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పావు లభించడంతో ఆ ప్రాంతంలో మూడువేల సంవత్సరాల క్రితమే చదరంగం ఆడేవారని తెలుస్తోందన్నారు. ప్రస్తుతం లభించిన పావు 1.5 సెం.మీ వ్యాసంతో ఉందని, బాగా పాలిష్ చేసి నలుపురంగులో ఉందని తెలిపారు.

ఒకే టిక్కెట్టుపై మూడు రకాల ప్రయాణాలు

- మార్చి నుంచి అమలు
- డిసెంబరులో ఎంటీసీ, మెట్రోరైళ్లలో ప్రయోగం

పెరంబూర్, జూలై 14: ఒకే టిక్కెట్టుపై మూడు రకాల ప్రయాణం చేసే సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుంది. నగరం, శివారు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది ఎంటీసీ బస్సులు, సబర్బన్ రైళ్లు, మెట్రోరైళ్లలో ప్రయాణిస్తున్నారు. కొందరు ఇంటి నుంచి కార్యాలయాలకు వెళ్లాలంటే బస్సు, సబర్బన్ రైలు లేదా మెట్రో రైళ్ల ద్వారా ప్రయాణించాల్సి వస్తోంది. అలా, మూడు రకాల ప్రయాణాలు చేసే వారు ఒక్కో సంస్థ కింద పనిచేసే బస్సు, సబర్బన్ రైలు, మెట్రో రైలు వంటి వాటి కోసం వేర్వురుగా టిక్కెట్లు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మూడు రకాల ప్రయాణాలను కలిపి చెన్నై సమగ్ర కార్పొరేషన్ రవాణా మండలి ఏర్పాటుచేశారు. ఆ ప్రకారం, బస్సు రైలు, మెట్రోరైళ్లలో ఒకే టిక్కెట్టుతో ప్రయాణం చేసే విధానం రూపొందించేందుకు 'మూవింగ్ టెక్ ఇన్నోవేషన్' సంస్థకు టెండర్లు అప్పగించారు.

డిసెంబరు నుంచి ప్రయోగాత్మక అమలు...

తొలివిడతగా డిసెంబరు నుంచి ఎంటీసీ బస్సులు, మెట్రోరైళ్లలో ప్రయాణించేందుకు ఒకే టిక్కెట్టు విధానం అమలుకు రానుందని సమాచారం. వచ్చే ఏడాది మార్చిలో సబర్బన్ రైళ్లలో కూడా ప్రయాణం చేసేలా ఈ పథకాన్ని విస్తరించనున్నారు. మూడు రకాల రవాణా సేవలు వినియోగించుకొనే వారిని, ఈ విధానం శ్రమ లేకుండా ఎంతో సులభతరంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

నిత్య పెళ్లికూతురి అరెస్ట్



సత్య

ప్యారీస్, జూలై 14: ఈరోడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు సహా 53 మందిని పెళ్లాడి మోసం చేసిన నిత్య పెళ్లికూతురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ జిల్లా కొడుముడి ప్రాంతానికి చెందిన సత్య (40) తిరుప్పూర్ జిల్లా సేలం పాళయానికి చెందిన మహేష్ అరవింద్ (30)ని కిద్ది రోజుల క్రితం వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో, సత్య ప్రభుత్వ అధికారులు సహా 53 మందిని పెళ్లాడి మోసం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై తన భార్యను విచారించాలంటూ అరవింద్ తారాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి సత్య అజ్ఞాతంలోకి జారుకుంది. ఆమె కోసం ఈరోడ్, కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో గాలించిన తారాపురం పోలీసులు ఎట్టకేలకు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. విచారణలో తిరుప్పూరు, ఈరోడ్, కోయంబత్తూరు, మదురై, చెన్నై సహా పలు జిల్లాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, డీఎస్పీ, ఎస్ఐ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యువకులు సహా 53మందిని తన వలలో వేసుకుని వివాహం పేరుతో లక్షలాది రూపాయల నగదు, నగలను దోచుకున్నట్లు వెల్లడైంది. ఆమెపై నగదు, పురుషులను మోసం చేసి వివాహం చేసుకోవడం తదితర కేసులు నమోదుచేశారు. సత్య ఎవరెవరిని వివాహం చేసుకుందన్న వివరాలు, ఆమె కాజేసిన నగలు, నగదు వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమెకు మధ్యవర్తిగా వ్యవహరించిన తమిళ్‌సెల్వి సహా ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

ఆస్పత్రి నుంచి మంత్రి దురైమురుగన్ డిశ్చార్జి

ప్యారీస్, జూలై 14: అస్వస్థత కారణంగా నగరంలోని అపోలో ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం కోలుకున్న మంత్రి దురైమురుగన్ డిశ్చార్జి అయ్యారు. విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకే ఘనవిజయం సాధించడంతో డీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్టీ నిర్వాహకులు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతో కరచాలనం చేస్తున్న సమయంలో మంత్రి దురైమురుగన్ హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో ఆయనను అపోలో ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిన తరువాత కోలుకున్న దురైమురుగన్ శనివారం రాత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

విస్తారంగా వర్షాలు : పడిపోయిన పూల ధరలు

అడయార్, జూలై 14: రాష్ట్రంలోని మదురై, నీలగిరి, దిండిగల్ వంటి అనేక జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దాని కారణంగా కోయంబేడు మార్కెట్‌లో పూల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆదివారం ఒక కేజీ మల్లె పూల ధర రూ.250, జాజిమల్లి, చామంతిలు రూ.200, కనకాంబరాలు రూ.300, ఆరణి పూలు రూ.40, సంపంగి రూ.60, చెక్లెట్ రోజ్ రూ.50, పన్నీర్ రోజ్ రూ.20 చొప్పున ధర పలికింది. దీనిపై కోయంబేడు పూల మార్కెట్ వ్యాపారుల సంఘం ఉపాధ్యక్షుడు ముత్తురాజ్ మాట్లాడుతూ హోసూర్, మదురై, దిండిగల్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీంతో తడిసిన పూలు మార్కెట్‌కు వస్తున్నాయన్నారు. ఈ కారణంగా దరలు పడిపోయాయని ఆయన తెలిపారు.

చిట్లపాకం చెరువుకు మరమ్మతులు చేయాలని 19న అన్నాడీఎంకే ధర్నా

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిట్లపాకం చెరువుకు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాంబరం కార్పొరేషన్ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 19న భారీ ధర్నా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. డీఎంకే పాలకులు ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోరని, ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. తాంబరం కార్పొరేషన్ పరిధిలోని చిట్లపాకం- చెంబాక్కం ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, ఈ విషయమై తమ పార్టీ స్థానిక నాయకులు, కౌన్సిలర్లు పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రూ.25కోట్లతో చిట్లపాక్కం చెరువు మరమ్మతులు ప్రారంభించామని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులను అర్థాంతరంగా ఆపిందన్నారు. తాంబరం కార్పొరేషన్‌లో ప్రజలకు ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా ఆస్తిపన్ను విపరీతంగా పెంచేశారన్నారు. ఈ పరిస్థితులలో తాంబరం కార్పొరేషన్ అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని ఖండిస్తూ ఈ నెల 19 సాయంత్రం పార్టీ ఆధ్వర్యంలో చిట్లపాక్కం రెండు రోడ్ల కూడలి వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు.

పాఠశాల కమిటీకి సభ్యుల ఎంపిక

పెరంబూర్, జూలై 14: పాఠశాల నిర్వహణ కమిటీకి కొత్త సభ్యులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2022లో ఏర్పాటైన పాఠశాల నిర్వహణ కమిటీ పదవీకాలం ఈ ఏడాదితో ముగియనుంది. ఈ కారణంగా, కమిటీకి కొత్త సభ్యులను ఎంపిక చేయనున్నారు. కలెక్టర్‌తో సమావేశమై పర్యవేక్షకులను నియమించి పాఠశాల నిర్వహణ కమిటీకి కొత్త సభ్యుల ఎంపిక చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఆకుపచ్చగా మారిన వీరాణం జలాలు



ఐసిఎఫ్, జూలై 14: వీరాణం జలాశయం నీరు పచ్చరంగుకు మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కడలూరు జిల్లా సేద్యాతోపు బూదన్‌కుడి నుంచి ప్రారంభమయ్యే ఈ జలాశయం లాల్‌పేట వరకు 14కి.మీ దూరం, 5 కి.మీ విస్తీర్ణంలో 32 తూములు కలిగి ఉంది. మొత్తం 1,465 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన జలాశయంలో ప్రస్తుతం 1,300 మిలి యన్ ఘనపుటడుగుల నీరు నిల్వవుంది. ఈ జలాశయం కింద 50 వేల ఎకరాలు సాగవుతున్నాయి. అలాగే, చెన్నై నగర ప్రజల తాగునీటి అవసరాలు పూర్తి చేస్తుంది. గత నెల 17వ తేది మేట్టూరు నుంచి 2,000 ఘనపుట డుగుల వంతున విడుదల చేసిన నీరు 26వ తేది కీలనై డ్యాంకు చేరుకున్నాయి. అక్కడి నుంచి విడుదల చేసిన నీరు వడవారు మీదుగా వీరాణం జలాశయానికి చేరాయి. ప్రస్తుతం జలాశయానికి వచ్చే నీరు పచ్చరంగులో ఉండడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జలవనరుల శాఖ అధికారులు నీటి నమూనాలు సేకరించి పరిశోధనకు పంపారు.

అన్నామలైకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

ప్యారీస్, జూలై 14: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగైను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు వ్యతిరేకంగా ఆదివారం చెన్నై పశ్చిమ జిల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చూలై పోస్టాఫీసు సమీపంలో నిర్వహించిన ఈ ధర్నాలో టీఎన్‌సీసీ నిర్వాహకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు అరుంబాక్కం వీరపాండ్యన్ మాట్లాడుతూ... బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో సెల్వపెరుందగైకు సంబంధాలున్నాయంటూ అన్నామలై ఆరోపించారని, బీజేపీ కార్యాలయం కమలాలయంలో కరుడుగట్టిన నిందితులకు ఆశ్రయం కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆందోళనలో చక్రవర్తి, ఆర్డీ కుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఆన్‌లైన్ ఓటింగ్



ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థులు

పెరంబూర్, జూలై 14: తేని జిల్లా పాడి సైన్స్ వాలి పబ్లిక్ పాఠశాలలో విద్యార్థుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక శనివారం జరిగింది. ప్రిన్సిపాల్ షబానా ప్రవీణ్ పర్యవేక్షణలో సాగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు పదవికి ఒక విద్యార్థి, ఇద్దరు విద్యార్థినులు, ఉపాధ్యక్షుడు పదవికి ముగ్గురు విద్యార్థులు, ఆరుగురు విద్యార్థినులు నామినేషన్లువేశారు. పోటీలో ఉన్న వారు పేర్లు, కేటాయించిన చిహ్నాలు కంప్యూటర్‌లో నమోదుచేశారు. పాఠశాలలోని 700 మంది విద్యార్థినీ, విద్యార్థులు కంప్యూటర్‌లో ఓటు వేశారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఈ ఎన్నికలు నిర్వహించామని, ఎన్నికల్లో గెలుపొందిన వారి వివరాలు సోమవారం వెల్లడించడంతో పాటు వారిచే ప్రమాణ స్వీకారం చేయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చిరుత సంచారంపై డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ



డ్రోన్ కెమెరా వినియోగిస్తున్న అటవీ సిబ్బంది

పెరంబూర్, జూలై 14: సేలం జిల్లా ఎడప్పాడి యూనియన్ పరిధిలోని గ్రామాల ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు 24 గంటలు శ్రమిస్తున్నారు. కొంబైకాడు, ఓడువంగాడు, సన్నియాసి, మున్నియప్పన్ కోయిల్, సెంగుట్టపట్టి, గుండుమలైకార్డు తదితర గ్రామాలు అటవీ ప్రాంతం పరిధిలో ఉన్నాయి. కొద్దిరోజులుగా ఈ గ్రామాల్లో కోళ్లు, మేకలు ఏదో జంతువు దాడితో మరణిస్తుండడంతో ప్రజలు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి దాడిచేస్తుంది చిరుత పులిగా గుర్తించారు. దీంతో, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన అధికారుల, డ్రోన్ కెమెరా ద్వారా చిరుత సంచారం తెలుసుకొని బంధించేందుకు 24 గంటలు శ్రమిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ ఖర్చుతో ప్రైవేటు స్కూళ్లకు అభినందన సభా...?

- పీఎంకే నేత అన్బుమణి విమర్శ

పెరంబూర్, జూలై 14: పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ ఖర్చుతో అభినందన సభ చేయడం తగదని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఇలాంటి సభల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యలను అధికారులు పొడిగితే విద్యార్థుల్లో ప్రైవేటు పాఠశాలపై మక్కువ చూపించే అవకాశముందన్నారు. ఆ సభకు వినియోగించే నిధులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు వినియోగించాలన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి, ఆగస్టు 4న జరుపతలపెట్టిన అభినందన సభ రద్దు చేసుకోవాలని డా.అన్బుమణి సూచించారు.

తీరానికి డాల్ఫిన్ కళేబరం



పెరంబూర్, జూలై 14: మరక్కాణం సముద్రతీరానికి డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. విల్లుపురం జిల్లా మరక్కాణం తీర్థవారి సముద్రతీరంలో డాల్ఫిన్లు, సముద్రపు తాబేళ్లు గుంపులుగా సంచరిస్తుంటాయి. అలా వచ్చిన డాల్ఫిన్లు, తాబేళ్లు పడవలకు చిక్కుకొని మృతిచెందుతుంటాయి. ఈ నేపథ్యంలో మరక్కాణం తీర్థవారి సముద్రతీరానికి శనివారం సుమారు డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులతో అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించిన డాల్ఫిన్ కళేబరాన్ని పూడ్చిపెట్టారు.

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు



మాంసాహార విందులో పురుషులు

పెరంబూర్, జూలై 14: పుదుకోట జిల్లా అరియమరక్కాడు గ్రామంలో వెలసిన శ్రీకమలకండై మునీశ్వరాలయంలో మూడేళ్లకు ఒకసారి నిర్వహించే బలిపూజలు ఆదివారం కోలాహలంగా సాగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు, తమ కోర్కెలు తీరితే మేకలు, పొట్టేళ్లను స్వామివారికి సమర్పిస్తుంటారు. మూడేళ్లకు ఒకసారి ఈ మేకలు, జంతువులను స్వామివారికి బలిచ్చిన అనంతరం మాంసాహారంతో విందు ఏర్పాటుచేస్తుంటారు. ఈ విందులో పరిసర గ్రామాలకు చెందిన పురుషులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు మహిళల మృతి



మృతులు వీరమ్మాళ్, సత్యవేణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 14: విల్లుపురం జిల్లా పులిచ్చపాళయం గ్రామ సమీపంలోని పొలంలో పనిచేస్తున్న మహిళలు విద్యుదాఘాతంతో మృతిచెందారు. పులిచ్చపాళయం గ్రామానికి చెందిన శేఖర్ తన సవుక చెట్ల తోట చుట్టూ ఇనుప కంచె ఏర్పాటుచేశాడు. ఈ తోటలో శనివారం సత్యవేణి, విరమ్మాళ్ పని చేస్తున్నారు. ఆ సమయంలో ఈదురుగాలులకు తోట మీదుగా వెళుతున్న విద్యుత్ వైరు తెగి కంచెపై పడింది. ఈ విషయమై తెలియని సత్యవేణి, వీరమ్మాళ్ తోట నుంచి తిరిగి వస్తూ కంచెకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకే రోజు రూ.224 కోట్ల మేర రిజిస్ట్రేషన్లు

పెరంబూర్, జూలై 14: రిజిస్ట్రేషన్ శాఖలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఈ నెల 12న ఒకేరోజు రూ.224 కోట్ల ఆదాయం లభించింది. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఆణిమాసం చివరి ముహూర్తపు రోజైన శనివారం ప్రజలు అధికంగా భూముల క్రయవిక్రయాలు చేపట్టారు. ఆ ప్రకారం, 20,310రిజిస్ట్రేషన్ల ద్వారా ఒకేరోజు రూ.224.26 కోట్ల ఆదాయం సమకూరింది. ముహూర్తపు రోజు కావడంతో శుక్రవారం సాధారణంగా అందించే టోకెన్ల కన్నా అధికంగా టోకెన్లు అందజేశారు.

చిన్నారుల్లో దైవచింతన పెంపొందించడమే జెట్ లక్ష్యం

● రవీంద్రకుమార్ రెడ్డి



విజేతలతో జెట్ నిర్వాహకులు

ప్యారీస్, జూలై 14: చిన్నారుల్లో దైవచింతన పెంపొందింపజేయడమే లక్ష్యమని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై విభాగం అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్ రెడ్డి పేర్కొన్నారు. టి.నగర్‌లోని వాణి మహల్‌లో ఆదివారం భజన పాటల పోటీలు రవీంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగాయి. నగరంలోని 25 పాఠశాలలకు చెందిన సుమారు 250 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, రామ, కృష్ణ, నారాయణ, నరసింహ, రామానుజ నామ సంకీర్తన, భజన పాటలను ఆలపించి భక్తిని చాటుకున్నారు. జూనియర్, సీనియర్ కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన బృందాలకు రవీంద్రకుమార్ రెడ్డి నేతృత్వంలో సభ్యులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ... త్రిదండి చినజీయర్ స్వామి మంగళశాసనాలతో 30 ఏళ్లుగా ఇలాంటి ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించి చిన్నారుల్లో దైవచింతన పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే వారం అశోక్‌నగర్‌లోని జీఆర్టీ మహాలక్ష్మి పాఠశాల ప్రాంగణంలో స్తోత్ర పోటీలు, డ్రాయింగ్, క్విజ్, నాలాయిర దివ్య ప్రబంధనం తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తర చెన్నై సమగ్రాభివృద్ధే లక్ష్యం

● మంత్రి పీకే శేఖర్‌బాబు ● 5 నియోజకవర్గాల్లో పరిశీలన



సామాజిక కేంద్రం నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాలు, కార్మికులు అధికంగా ఉన్న ఉత్తర చెన్నై ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే డీఎంకే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎండీఏ ఛైర్మన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు. ఆదివారం ఉదయం ఉత్తర చెన్నై పరిధిలోని ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పెరంబూరు శాసనసభ నియోజకవర్గంలోని ఎంకేబీ నగర్ సెంట్రల్ అవెన్యూ రోడ్డులో సీఎండీఏ ఆధ్వర్యంలో సామాజిక కేంద్రం నిర్మించనున్న స్థలాన్ని, ఆర్కేనగర్ నియోజకవర్గంలోని క్రీడా మైదానం నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇదే విధంగా మాధవరం నియోజకవర్గంలో 1.5 ఎకరాల్లో సామాజిక కేంద్రం నిర్మించనున్న ప్రాంతాన్ని, విల్లివాక్కం నియోజకవర్గంలోని ఉద్యానవనం నిర్మించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తర చెన్నై ప్రాంతంలోని ఐదు అసెంబ్లీనియోజకవర్గాల్లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, సీఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిపనులను వీలైనంత త్వరగా పూర్తి చేయమని సీఎం స్టాలిన్ ఆదేశించారని చెప్పారు. ఆ మేరకు తాను అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించినట్టు శేఖర్‌బాబు చెప్పారు. మంత్రితోపాటు గ్రేటర్ చెన్నై మేయర్ ప్రియ, ఉత్తర చెన్నై లోక్‌సభ సభ్యుడు డాక్టర్ కళానిధి వీరాసామి, నగరాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, నార్త్‌జోన్ డిప్యూటీ కమిషనర్ కట్టా రవి తేజ, సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ కేజే ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు ఆర్డీ శేఖర్, ఎబినేజర్, ఎస్.సుదర్శనం, వెట్రిట అళగన్, సీఎండీఏ ప్రణాళికా విభాగం ప్రధానాధికారి ఎ.బాల సుబ్రమణ్యం తదితరులు పర్యటించారు.

ఘనంగా టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు



చిరంజీవిని గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్యారీస్, జూలై 14: ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి జన్మదిన వేడుకలు ఆదివారం పురుషవాక్కం కెల్లీస్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణు ల సమక్షంలో కేక్ కట్ చేసి న చిరంజీవి పేదలకు సహాయాలు పంపిణీ చేశారు. ఏఐసీసీ సభ్యుడు ఎస్.రంగభాష్యం, నార్త్ చెన్నై పశ్చిమ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాళ్లూరి సురేష్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు అరుళ్‌జ్యోతి, ఇల భాస్కర్, సౌతిండియా రాహుల్ గాంధీ వెల్ఫేర్ అసోసియేషన్ గోల్డన్ రఫి, సలీమ్ అహ్మద్, మహమ్మద్ సిరాజ్, పి.సురేష్ తదితరులు చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు.

నిండు కుండలా కబిని డ్యాం

కావేరి తీర ప్రాంతాలకు వరద హెచ్చరిక



చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక లోని కబిని డ్యామ్ నిండి పొంగి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలోని కావేరీ తీర ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. కర్ణాటకలోని కృష్ణరాజసాగర్, కబిని డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కుండపోత వర్షాలు కురవటంతో జలాశయాలన్నీ నీటితో నిండిపోయాయి. అదే సమయంలో రాష్ట్రానికి కావేరి జలాలను విడుదల చేయడంపై కర్ణాటక ప్రభుత్వం తన పట్టు సడలించ లేదు. కావేరి జలాల విడుదల విషయంపై అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అఖిల పక్ష సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. ఈ పరిస్థితుల్లో కబిని డ్యామ్ నుంచి ప్రస్తుతం అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. కర్ణాటక జలాశయాల నుంచి విడుదలవుతున్న నీరు రాష్ట్రంలో పిలిగుండ్లు ప్రాంతానికి చేరుతున్నాయి. ఆదివారం వేకువజాము సెకనుకు ఐదువేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. అవి హొగెనేకల్ జలపాతం గుండా మేట్టూరు డ్యామ్‌లోకి ప్రవేశించనున్నాయి. మేట్టూరు డ్యామ్‌లో ఆదివారం ఉదయం సెకనుకు 4013 ఘనపుటడుగుల మేర జలాలు ప్రవేశిస్తున్నట్లు అధికారులు చెప్పారు. దీంతో కావేరి పరీవాహక ప్రాంతాల్లో వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. హొగెనేకల్, పిలిగుండ్లు తదితర ప్రాంతాల వద్ద వరద ఉధృతి అధికంగా ఉంటుందని, ఆ ప్రాంతాలకు చేరువగా నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరించారు.

విజయ్ ఆదిరాజ్ దర్శకత్వంలో 'నొడిక్కు నొడి'

చిత్రజ్యోతి

విజయ్ ఆదిరాజ్ దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రానికి 'నొడుక్కి నొడి' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ఆదివారం ప్రారంభమైంది. నాక్స్ స్టూడియోస్ పతాకంపై నిర్మాత ఆరోగ్యదాస్ తెరకెక్కే ఈ చిత్రంలో అశ్విన్ కుమార్, శ్యామ్, నరేన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బుల్లి తెర నటుడిగా, అర్జేగా రాణిస్తున్న విజయ్ ఆదిరాజ్... 'పుత్తగం' అనే చిత్ర ద్వారా కోలీవుడ్‌లో దర్శకుడిగా పరిచయమయ్యారు. అనేక కమర్షియల్ యాడ్స్ రూపొందించిన అనుభవంతో 'నొడుక్కి నొడి' పేరుతో తన తదుపరి ప్రాజెక్టు ప్రారంభించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఉత్కంఠభరితంగా సాగే స్క్రీన్‌ప్లేతో ఒక సినిమా రూపొందించాలన్నదే నా కల. ఆ బాణీలోనే ఈ సినిమా ఉంటుంది.అమ్రేష్ సంగీతం అందిస్తున్నారు.చాలా ప్రతిభావంతుడైన సంగీత దర్శకుడు. నమ్రిత, అభిరామి, మేఘా రాజన్ ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్‌ను పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని పేర్కొన్నారు.



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

శివరాజ్‌కుమార్ హీరోగా తమిళ చిత్రం

త్యాగరాజన్ నిర్మాతగా కొత్త సినిమా

కన్నడ అగ్రహీరో శివరాజ్ కుమార్ తమిళంలోకి హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. ప్రముఖ నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో తెరకెక్కే ఈ చిత్రానికి రవి అరసు దర్శకుడు. ఈ సినిమాకు 'జావా' అనే టైటిల్ ఖరారు చేశారు. కొందరు హీరోలకు ప్రాంతీయ హద్దులుదాటి అభిమానులుంటారు. అలాంటి వారిలో శివ రాజ్ కుమార్ ఒకరు. శాండల్‌వుడ్‌లో భారీగా అభిమానులనున్న శివరాజ్ కుమార్... తమిళ ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. ఆయన నటించే కన్నడ చిత్రాలకు తమిళనాట కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఇటీవల సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్'లో ఓ కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో 'జావా' పేరుతో తెరకెక్కే తమిళ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సీనియర్ నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై సెంధిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులున్న శివరాజ్ కుమార్ వంటి స్టార్ హీరో చిత్రానికి దర్శకత్వం చేయనుండటం గర్వంగా ఉంది. సెప్టెంబరులో సినిమా షూటింగ్ ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఇందులో జావా బైక్‌కు ఓ ఇంపార్టెంట్ రోల్ ఉంది. ఇంతకుమించి స్టోరీ వెల్లడించలేను. శివరాజ్ కుమార్ పోలీస్ పాత్రలో కనిపిస్తారు. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు' అని వివరించారు.



శివరాజ్ కుమార్‌తో రవి అరసు, టీజీ త్యాగరాజన్



కోలీవుడ్‌కు మరో కొత్త హీరో

ఒకప్పటి యూ ట్యూబర్ హరి భాస్కర్ హీరోగా పరిచయమవుతున్నారు. శ్రీతేనాండాళ్ ఫిలిమ్స్ సమర్పణలో తెరకెక్కే 'మిస్టర్ హౌస్ కీపింగ్' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అరుణ్ రిచంద్రన్ దర్శకుడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఎన్నో కుటుంబ కథా చిత్రాలతో విశేష ఆదరణ పొందిన తేనాండాళ్ ఫిలిమ్స్ తన 101వ చిత్రంగా ఈ సినిమా నిర్మిస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా, కమర్షియల్ థ్రిల్లర్‌గా, ప్రేక్షకులను నవ్వించే కథాంశంతో ఒక మంచి సందేశాత్మక సినిమా రూపొందిస్తామని తెలిపారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుందని, అన్ని పనులను ముగించి, పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాని వెల్లడించారు.

నేటినుంచి కార్తీ 'సర్దార్' షూటింగ్ ప్రారంభం

కార్తీ హీరోగా నటించిన 'సర్దార్' చిత్రానికి రెండో భాగం షూటింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 15 నుంచి ప్రారంభంకానుంది. 2022లో 'సర్దార్' తొలిభాగం వచ్చింది. కార్తీ ద్విపాత్రాభినయం పోషించిన ఈ చిత్రం సూపర్‌డూపర్ హిట్ సాధించింది. రూ.100 కోట్ల మేరకు వసూళ్ళను రాబట్టింది. ఈ నేపథ్యంలో రెండో భాగాన్ని ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. తొలి భాగంలో నటించిన నటీనటులే రెండో భాగంలోనూ నటించనున్నారు. అయితే, తొలి భాగానికి జీవీ ప్రకాష్ సంగీతం సమకూర్చగా, రెండో భాగానికి మాత్రం యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. మిగిలిన వివరాలను తర్వాత వెల్లడించనున్నారు.



కార్తీ, మిత్రన్, లక్ష్మణ్ కుమార్

రాష్ట్రంలో కాయకష్టం చేసే కూలీల నుంచి కోటీశ్వరుల వరకు, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఇష్టపడే ప్రత్యేకమైన అల్పాహారం ఏదంటే పరోటా విత్ సాల్నా అని టకీమని సమాధానం చెప్పవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలోని యువతంతా పరోటా సాల్నా రుచికి ఫిదా అయిపోతున్నారనటం అతిశయోక్తి కాది. మైదాపిండితో తయారయ్యే పరోటాలను పరిమితంగా తినాలని, లేకుంటే ఆరోగ్యం పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నా యువత పెడచెవిన పెడుతోంది. పరోటాలను ఆబగా తినేవారి సంగతి ఇలా ఉంటే... వివిధ రకాల్లో పరోటాలను తయారు చేసే పరోటా మాస్టర్ల సంగతి మరోలా ఉంది. పరోటా మాస్టర్లుగా చేతి నిండి సంపాదిస్తున్నారని, సింగపూర్‌లో పరోటా మాస్టర్‌కు నెలకు రూ.లక్షకు పైగా వేతతన ఇస్తున్నారని చెబితే ఆశ్చర్యమే కదా!

- ఆంధ్రజ్యోతి, చెన్నై



పరోటాలు, సాల్నా

స్టార్‌హోటల్‌లో పరోటాల అలంకారం

ఆహో ఏమి రుచి!

పరోటా విత్ సాల్నాకు యువత ఫిదా

● రోజుకు 50లక్షల పరోటాల స్వాహా

దక్షిణాది జిల్లాల్లో పెరిగిన గిరాకీ...

చెన్నై వంటి పెద్ద నగరాలన్నింటిలో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు పరోటాలను ఇష్టపడి తింటున్నారు. అయినా దక్షిణాది జిల్లాల్లో ఈ పరోటాలకు గిరాకీ అధికం. తూత్తుకుడి పరోటా, తిరునల్వేలి పరోటా, సెంగోట్టై బార్డర్ పరోటా అంటూ ఆయా ప్రాంతాలకు తగినట్లు పేర్లు పెట్టి పిలుస్తున్నారు. కొత్తు పరోటా, వీచ్చి పరోటా, నూనెలో వేయించిన విరుదునగర్ పరోటా సైజులో చాలా పెద్దగా ఉంటాయి. మలబార్ పరోటా, సిలోన్ పరోటా, చిల్లీ పరోటా, ఎగ్ పరోటా, కాలీఫ్లవర్ పరోటా ఇలా వివిధ రకాల పరోటాలను హోటళ్లలోతయారుస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధసమయంలో గోధుమలు కొరత ఏర్పడటంతో దానికి ప్రత్యామ్నాయంగా మైదాపిండితో పరోటాలు తయారు చేయటం ప్రారంభమైంది. ఆ తర్వాతే పరోటాలు కాలక్రమేణా రోజు వారీ ఆహారంలో అంతర్భాగమైపోయింది. మైదాపిండితో చేసిన పరోటాను కాగుతున్న పెనంపై వేసి వేయిస్తే నోరూరించే పరోటా రెడీ, సైడ్ డిష్‌గా సాల్నా, చికెన్ గ్రేవీ, ఫిష్ గ్రేవీ, కుర్మాలో నంచుకుని తింటే ఆ ఏమి రుచిలే అంటూ అందరూ నాలుక చప్పరించాల్సిందే!.



పరోటా తయారీ విధానం వివరిస్తున్న ట్రైనర్

అరటి ఆకులో పరోటాను గులాబీ పూల రేకులు తీసినట్టుగా విడదీసి అందులో సాల్నా పోసుకుని కలిపి తింటుంటే నా సామిరంగా ఆ రుచే వేరని పరోటా ప్రియులు చెబుతారు.. రాష్ట్రంలోని పలు నగరాల్లో రోడ్‌సైడ్ బడ్డీ కొట్టు నుంచి స్టార్ హోటళ్ల వరకూ రోజురోజుకూ పరోటాలపై మోజు అధికమవుతూనే ఉంది. రోడ్‌సైడ్ తోపుడు బండ్ల టిఫిన్ సెంటర్లలో ఒక్కో పరోటా ధర రూ.5ల నుంచి రూ.20ల వరకు ఉంది. ఇక హోటళ్ళలో పరోటా సెట్ (రెండు) ధర రూ.100ల పైచిలుకే, రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లలో ఈ పరోటాలు రూ.200ల నుంచి రూ.500ల ధరకు లభిస్తున్నాయి.



రాజధాని నగరం చెన్నైలో సాయంత్రం వేళలో రోడ్డు పక్క దుకాణాల్లో రోజురోజుకూ గుమికూడే పరోటా ప్రియుల సంఖ్యల విపరీతంగా పెరుగుతూనే ఉంది కానీ తగ్గడం లేదు. రాష్ట్రమంతటా హోటళ్లలో టేబుల్ భోజనమైనా, బఫే మోడల్ అయినా అందులో పరోటాలు తప్పనిసరి. రాష్ట్రమంతటా 20 లక్షలకు పైగా హోటళ్లు, లక్షలాదిగా రోడ్ సైడు కాక హోటళ్లు కూడా ఉన్నాయి. వీటిలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఆహారం ఏదంటే పరోటాలే!

హెచ్చరికలు భేఖాతరు...

నగరాల్లోనే యువతీ యువకులకు పరోటాలను సాల్నాలో కలిపి తినడం అలవాటుగా మారిందంటే అతిశయోక్తి కాదు. పరోటాలు అధికంగా తింటే ఆరోగ్యం దెబ్బతింటుందని ఆహారభద్రతా విభాగం అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. రాష్ట్రంలో ఒక రోజు 50లక్షలకు పైగా పరోటాలు విక్రయిస్తున్నట్లు హోటల్ యజమానులు చెబుతున్నారు. అదే విధంగా పరోటా మాస్టర్ల కొరత కూడా అధికంగా ఉందని, వారికిచ్చే జీతభత్యాలు కూడా విపరీతంగా పెరిగాయంటున్నారు.. పరోటా సాల్నా వ్యాపారం వల్ల రోజూ కోట్లాది రూపాయలు చెలామణీ అవుతున్నట్లు పరోటా దుకాణం యజామని ఒకరు చెప్పారు.

పరోటాల తయారీపై శిక్షణ...

ఈ పరోటాలను అందరూ సులువుగా చేయలేరు. పరోటా తయారు చేయడం కూడా ప్రత్యేకమైన కళ అని మదురైకి చెందిన పరోటా మాస్టార్ మహమ్మద్ ఖాసిం చెబుతున్నారు. 'సెల్ఫీ పరోటా ట్రైనింగ్ సెంటర్' పేరుతో ఆయన పరోటాల తయారీ శిక్షణా కేంద్రాన్ని సమర్థవంతంగా నడుపుతున్నారు. ఆ శిక్షణా సంస్థలో మూడువేలమందికి పైగా యువకులు శిక్షణ పొంది పలుచోట్ల పరోటా మాస్టర్లుగా పనిచేస్తున్నారు. డాక్టర్లు, ఐటీ ఉద్యోగులు, ఎంఫిల్ పట్టభద్రులు ఇలా అన్ని వర్గాలవారు పరోటా తయారీపై శిక్షణ పొందారు.. చెన్నైలో పీజీ చదివిన దయానా పరోటాల తయారీపై శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం ఇంగ్లాండులోని రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. తిరునల్వేలికి చెందిన అరుణ్ ఇంజనీరింగ్ ఉద్యోగానికి ఉద్వాసన పలికి పరోటా తయారీపై శిక్షణ పొందారు. ఇదే విధంగా కార్పెంటర్ కమ్ కంట్రాక్టర్‌గా ఉన్న ఓ వ్యక్తి పరోటా తయారీపై శిక్షణ పొంది మలేసియాలో పరోటా మాస్టర్‌గా చేతి నిండి సంపాదిస్తున్నారు. చెన్నైకి చెందిన ప్రసన్న అంబత్తూరులోని ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఈయన కూడా పరోటా తయారీ చేయడానికి శిక్షణ పొందారు. నేటి కాలంలో పలు చోట్ల పరోటా మాస్టర్లకు కొరత అధికంగానే ఉంది. అందువల్ల హోటళ్ల యజమానులు పలువురు పరోటా తయారు చేయడం నేర్చుకుని తమ హోటళ్లలో పనిచేసే కార్మికులకు పరోటా తయారు చేయడం నేర్పుతున్నారు.

పరోటా మాస్టర్‌కు నెలకు రూ.90 వేలు...

ఫిస్ట్ పద్ధతిలో పనిచేసే పరోటా మాస్టర్లు రోజుకు రూ.1500లు సంపాదిస్తున్నారు. రోజుకు రెండు షిఫ్టులు పనిచేస్తే రోజువారి సంపాదన మూడువేలుంటుంది. దీంతో నెలకు రూ.90 వేల వరకు పరోటా మాస్టర్లు సంపాదిస్తున్నారంటే ఆశ్చర్యపోవాల్సిందే. అదే వాస్తవం! దుబాయ్, సౌదీ వంటి దేశాలలో నెలకు రూ.40వేల జీతం లభిస్తుంది. సింగపూర్‌లో పరోటా మాస్టర్‌కు నెల జీతం రూ.లక్ష వరకు ఇస్తున్నారు. చెన్నై వంటి పెద్ద నగరాల్లో శని, ఆదివారాల్లో పరోటా అమ్మకాలు అత్యధికంగా ఉంటాయి. ముఖ్యంగా మద్యపాన ప్రియులు పరోటాలు తినేందుకే ఇష్టపడుతున్నారు. రెండు పరోటాలు, ఆమ్లెట్, హాఫ్‌బాయిల్ తింటేనే తాగిన ఫీల్ వస్తుందని మందుబాబులు చెబుతున్నారు. ఇలా మద్యం తాగి పరోటాలను కడుపునిండుగా తినటం వల్ల ఆరోగ్యం దెబ్బతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే ఆ హెచ్చరికలన్నింటినీ మద్యపాన ప్రియులు కూడా భేఖాతరు చేస్తున్నారు. ఇక తాజా తమిళ చిత్రం 'గరుడన్' ద్వారా హీరోస్థాయికి ఎదిగిన కమెడియన్ పరోటా సూరి తొలిచిత్రంలో అధికంగా పరోటాలు తినే పోటీ సీన్ ద్వారానే ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకోవడం ఇక్కడ కొసమెరుపు!

రెండో సీజన్‌కు ముస్తాబవుతున్న ఊటీ



పార్క్‌లో పచ్చగడ్డి లెవల్ చేస్తున్న ఉద్యోగులు - మొక్కలను సంరక్షిస్తున్న మహిళలు

పెరంబూర్, జూలై 14: ఊటీ బొటానికల్ పార్క్ రెండో సీజన్‌కు ముస్తాబవుతోంది. నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్క్ ప్రపంచస్థాయిలో పర్యాటక కేంద్రంగా ఉంది. ప్రతి ఏటా సుమారు 35 లక్షల మంది పార్క్‌ను సందర్శిస్తుంటారు. వారాంతంలోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పార్క్ అంతా పచ్చదనం ఆవరించుకుంది. పర్యాటకుల మరింత ఆహ్లాదం కలిగించేలా పర్యాటక, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్-జూన్, సెప్టెంబరు-నవంబరులో రెండు విడతగా ఈ పార్క్‌లో పుష్పాలు, పండ్లు,సుగంధ ద్రవ్యాలు, డాగ్ షో, పడవ పందేలు, చేపలు పట్టే పోటీలు సహా పలు రకాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో,సెప్టెంబరులో ప్రారంభం కానున్న రెండో సీజన్‌కు పార్క్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కుండీల్లో బాల్సమ్, బ్లాక్స్, జిన్నా, పాన్సీ, లుపిన్, సాల్వియా, డహిల, లిలియుమ్, అమరావతి సహా పలురకాల పూల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.ఈ విషయమై పార్క్ అధికారులు మాట్లాడుతూ..రెండో సీజన్ కోసం నాటిన మొక్కలు వచ్చే నెల రెండో వారంలో పూలు పూయడం ప్రారంభిస్తాయని, సెప్టెంబరు మొదటి వారంలో విరబూసిన పూల అందాలు పార్క్ మనోహరంగా ఉంటుందని తెలిపారు.

సీఎం స్టాలిన్‌తో విక్రవాండి విజేత భేటీ



చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న ఎమ్మెల్యే అన్నియూరు శివ

అడయార్, జూలై 14: విక్రవాండి ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేసిన డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా విజయం సాధించారు. ఈయన తన సమీప ప్రత్యర్థి పీఎంకే అభ్యర్థి అన్బుమణిపై 67,757 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో ఆదివారం చెన్నై వచ్చిన ఆయన డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు కలుసుకుని, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎం స్టాలిన్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.స్థానిక ఆళ్వార్‌పేటలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీనియర్ మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, పార్టీ సీనియర్ నేత ఎస్.జగద్రక్షన్, మంత్రులు ఏ.వీ వేలు, సెంజి మస్తాన్, ఆర్.గాంధీ, చక్రపాణి, అన్బిల్ మహేశ్, విల్లుపురం జిల్లాలకు చెందిన పలువురు పార్టీ సీనియర్ నేతలున్నారు.

పుదుచ్చేరిలో 'ఫ్రాన్స్ నేషనల్ డే'

పెరంబూర్, జూలై 14: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో నివసిస్తున్న ఫ్రెంచ్‌వారు ఫ్రెంచ్ దేశీయ దినోత్సవాన్ని కోలాహలంగా జరుపుకున్నారు. ఫ్రాన్స్, భారత్ జాతీయ పతకాలతో సుమారు 3 కి.మీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఫ్రెంచ్ పౌరులు ఆటపాటలతో సందడి చేశారు. 1789 జూలై 14వ తేది, ఫ్రాన్స్‌లో విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని అంతమొందించి, ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుదువైలో నివసిస్తున్న ఫ్రెంచ్ దేశస్తులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.



ఆటపాటల్లో ఫ్రెంచ్ దేశీయులు